క్లుప్తంగా

కార్మికుల సంక్షేమాన్ని కాపాడాలి



సమ్మెకు సంఘీభావం తెలుపుతున్న న్యాయవాదులు

ఏలూరు (టూటౌన్): సార్వత్రిక సమ్మెకు మద్దతుగా ఏలూరులో బుధవారం న్యాయవాదులు జిల్లా కోర్టుల్లో విధులు బహిష్కరించారు. కార్మిక, కర్షక వివిధ ప్రజాల సంఘల ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన, రమా మహల్ సెంటర్లో భారీ బహిరంగ సభ నిర్వహించారు. సభలో ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా జాయింట్ సెక్రటరీ, న్యాయవాది కట్టా సత్యనారాయణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కోడ్‌లను నిలుపుదల చేయాలని, కార్మికుల సంక్షేమాన్ని కాపాడాలని కోరారు. బ్రిటిష్ కాలం నాటి నుంచి పోరాడి సాధించుకున్న 29 చట్టాలు అమలను అమలు చేయాలన్నారు. న్యాయవాదులు పి.జాన్సన్, జోసెఫ్, కుమార్, బి.సుదర్శనరావు, ఐఏఎస్ కోచింగ్ సెంటర్ డైరెక్టర్ న్యాయవాది పి.రత్నరాజు, బి.సుదర్శనరావు తదితరులు పాల్గొన్నారు.

చాటపర్రు పశువైద్యాధికారిగా దివ్య

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం చాటపర్రు వైద్యశాల పశు వైద్యాధికారిగా వీరంకి దివ్య నియమితులయ్యారు. వీరవల్లి నుంచి బదిలీపై ఆమె ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె పశువైద్య శాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక గ్రీన్ సిటీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏలూరు డివిజన్ ఈఈ కేఎం అంబేద్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. హనుమాన్ నగర్, ఎన్‌టీఆర్ కాలనీ, గ్రీన్‌సిటీ, పెదపాడు రోడ్డు, శివసాయి నగర్, గణేశ్ కాలనీ, కొత్తూరు ఇందిరమ్మ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ఏలూరు మండలంలో..

దెందులూరు: చాటపర్రు ఫీడర్‌లోని ఎన్‌టీఆర్ కాలనీ, చాటపర్రు చేపల చెరువులో లైన్ నిర్వహణ నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి వరకు 11 కేవీ గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక ఫీడర్ పరిధిలో ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, కోమటిలంక, పెదయాగనమిల్లి ప్రాంతాలకు ఉదయం 10 నుంచి సాయంత్రం4 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ అంబేద్కర్ తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

లో బ్రిడ్జిల్లో నీరు.. రాకపోకలకు ఆటంకం

- ప్రమాదకరంగా మారిన వైనం
- ఇది ఏలూరులో ఉన్న అండర్‌పాస్‌ల పరిస్థితి
- కొద్దిపాటి వర్షానికే నీరు చేరిక
- పవర్‌పేట పై ఓవర్ నిర్మించాలంటూ ప్రజల డిమాండ్



స్నేహ వారధిలో నిలిచిన వర్షం నీరు (ఫైల్)



స్నేహ వారధిలో రోడ్డుపై ప్రమాదకరంగా మారిన పాకుడు



సీఆర్ఆర్ కాలేజీ సమీపంలోని రైల్వే అండర్ పాస్‌లో నీటిలోనే రాకపోకలు (ఫైల్)



రోడ్డుపై వర్షం నీటిలో ఫుట్ పాత్‌పై రాకపోకలు సాగిస్తున్న వాహనచోదకులు (ఫైల్)

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగరంలోని లో బ్రిడ్జీలు ప్రమాదకరంగా మారాయి. వీటిల్లో కొద్దిపాటి వర్షానికే నీరు చేరుతుంది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. దీంతో ప్రజలు వేర్వేరు మార్గాల్లో అదనపు దూరం ప్రయాణించాల్సి వస్తోంది. ప్రధానంగా ఏలూరు నగరంలో ట్రాఫిక్ సమస్యను తగ్గించి రెండో పట్టణం నుంచి ఒకటో పట్టణం వైపుకు వెళ్లేందుకు ఆర్ఆర్‌పేట శ్రీనివాసా థియేటర్ సమీపంలో నిర్మించిన స్నేహ వారధి (లోబ్రిడ్జి) కొద్దిపాటి వర్షానికే నీరు చేరి రాకపోకలు స్తంభిస్తున్నాయి. సీఆర్ఆర్ కాలేజీ సమీపంలోని తమ్మిలేరు గట్టును ఆనుకుని నిర్మించిన లోబ్రిడ్జి కూడా కొద్దిపాటి వర్షానికే వర్షం నీరు నిల్వ ఉండి ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణ రోజుల్లోనూ ఈ లో బ్రిడ్జిల్లో నీరు ఊరుతుండటంతో పాకుడు పట్టి వాహనచోదకులు జారిపడుతున్నారు. లోబ్రిడ్జిల్లో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, లేని పక్షంలో పవరుపేట గేట్ ప్రాంతంలో, సీఆర్‌రెడ్డి కాలేజీ సమీపంలో ఫ్లై ఓవర్ బ్రిడ్జీలు నిర్మించాలని నగర వాసులు ముక్త కంఠంతో కోరుతున్నారు.

అదనపు ప్రయాణంతో అవస్థలు

అరగంట లోపు కురిసిన వర్షానికే లోబ్రిడ్జీల నిండా వర్షం నీరు చేరి ఆకస్మాత్తుగా రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ఈ మార్గాల్లో వెళ్లే వాహనచోదకులు కిలో మీటరు దూరం వెళ్లి మెయిన్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా వన్‌టౌన్ రావాల్సి వస్తుంది. అర కిలో మీటరు దూరంలోని పవరుపేట రైల్వే గేటు గుండా వెళ్దామంటే అది ఎప్పుడూ రద్దీతో మూసి ఉండే పరిస్థితి. దీంతో టూటౌన్ ప్రాంతంలోని ఆర్ఆర్‌పేట, కొత్తపేట, పత్తేబాద వంటి ప్రాంతాల నుంచి వన్‌టౌన్‌లోని పవరుపేట, మెయిన్ బజార్, రైతు బజార్, వివిధ ఆఫీసులకు వెళ్లేందుకు ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. బైపాస్ నుంచి నగరంలోకి కొత్త బస్టాండ్ ప్రాంతంలో ప్రవేశించే వాహనచోదకులది సైతం ఇదే పరిస్థితి.

రోగులకు ఇబ్బంది

టూటౌన్‌లోని ఆర్ఆర్‌పేట ప్రాంతంలోనే అత్యధికంగా ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌లు ఉన్నాయి. దీంతో ఏలూరు టౌన్‌తోపాటు పరిసర ప్రాంతాల ప్రజలు వచ్చేందుకు లోబ్రిడ్జి మార్గాన్నే ఉపయోగిస్తుంటారు. ఒక్కోసారి బ్రిడ్జి మూసి ఉండటంతో చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి తలెత్తుతుంది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఇబ్బందులు తప్పడంలేదు.

నిర్వహణ భారం

ఆర్ఆర్‌పేట శ్రీనివాస థియేటర్ ప్రాంతంలో ఉన్న లోబ్రిడ్జిలోకి ఊరే నీటిని లిఫ్ట్ చేసేందుకు ఒక మోటారు పనిచేస్తుంది. దీన్ని ఆపరేట్ చేయడంతో పాటు లోబ్రిడ్జిలో పేరుకు పోయిన షిల్ట్, ఇసుక, చెత్త వంటి వాటిని తొలగించేందుకు షిఫ్టుకు ఇద్దరు చొప్పున రెండు షిఫ్టుల్లో నలుగురు సిబ్బంది రెగ్యులర్‌గా పనిచేయాల్సి ఉంది. మోటారు ద్వారా నీటిని లిఫ్ట్ చేసేందుకు భారీగానే ఖర్చవుతుంది. లోబ్రిడ్జిలో నీరు ఊరకుండా శాశ్వత పరిష్కారం చూపితే గాని నగరపాలక సంస్థకు భారం తగ్గడంతో పాటు ప్రజల రాకపోకలకు పాట్లు తప్పుతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

శాశ్వత పరిష్కారం చూపాలి



స్నేహ వారధిలో నిత్యం నీరు ఉబికి రావడంతో పాటు కొద్దిపాటి వర్షానికే మునిగిపోతూ రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి. నీరు ఉబికి వస్తుండటంతో ఈ మార్గంలో పాకుడు పట్టి వాహచోదకులు జారి పడుతున్నారు. నగర వాసులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల్లో ఇది ఒకటి.

– బండి వెంకటేశ్వరరావు, సీపీఐ సీనియర్ నాయకుడు, ఏలూరు

ఫ్లై ఓవర్ నిర్మించాలి



నిత్యం ట్రాఫిక్ సమస్యతో అల్లాడుతున్న నగర ప్రజల కష్టాలను తీర్చేందుకు స్థానిక పవర్‌పేట గేట్ స్థానంలో ఫ్లై ఓవర్ నిర్మించాలి. దీనిపై గతంలోనే ప్రతిపాదనలు తయారు చేసి పంపారు. ప్రజల అవసరాలను తీర్చేందుకు నిర్మించిన లోబ్రిడ్జి కొద్దిపాటి వర్షానికే మునిగిపోతుంది. సీఆర్‌రెడ్డి కాలేజీ వద్ద లోబ్రిడ్జి సమస్యకు పరిష్కారం చూపాలి.

– బి.సోమయ్య, సీఐటీయూ, జిల్లా ఉపాధ్యక్షుడు, ఏలూరు

వృద్ధ దంపతులకు అండగా..

ఏలూరు టౌన్: ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ వృద్ధ దంపతులకు అండగా నిలిచారు. కుటుంబ సమస్యను సానుకూలంగా పరిష్కరించటంతో వారు బుధవారం ఏలూరులో జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన్ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన వృద్ధ దంపతులు బసవ ధనలక్ష్మి, సత్యనారాయణకు వారి కుమారుడు, కోడలు ఆస్తి విషయంలో ఇబ్బందులు పెడుతున్నారు. తీవ్రమైన మానసిక ఆవేదనకు గురైన వృద్ధ దంపతులు ఈనెల 5న ఏలూరులో ఎస్పీ శివకిషోర్‌ను కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. ధనలక్ష్మికి 1996లో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలతో కాలును కోల్పోయింది. ఇదే ప్రమాదంలో కుమారుడికి శారీరక వైకల్యం ఏర్పడింది. ఈ నేపథ్యంలో కుమారుడి ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఆస్తిని కుమారుడి పేరున రిజిస్ట్రేషన్ చేయించారు. కొంతకాలం కుమారుడు, కోడలు వృద్ధ తల్లిదండ్రులను సంరక్షించగా, ఇటీవల కాలంలో ఆస్తి విషయంలో తగాదాలు మొదలయ్యాయి. తమ ఇంటి నుంచి వెళ్లిపోవాలంటూ వృద్ధులను మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నారు. ఆ బాధను ఎస్పీ శివకిషోర్‌కు చెప్పుకున్నారు. వెంటనే స్పందించిన ఎస్పీ తగు చర్యలు తీసుకోవాలంటూ గణపవరం ఎస్సై మణికుమార్‌ను ఆదేశించారు. పోలీస్ అధికారి కుటుంబ సభ్యులను, వృద్ధులను పిలిచి కౌన్సెలింగ్ ఇచ్చి సమస్యను రాజీ చేశారు. తాము ఎంతో మానసిక సంఘర్షణకు గురవుతూ ఉన్నామనీ, తమ గోడును పట్టించుకుని సమస్య పరిష్కరించిన ఎస్పీ శివకిషోర్‌ను వృద్ధదంపతులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.



ఎస్పీ శివకిషోర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న వృద్ధ దంపతులు

ఏలూరులో వైఎస్సార్ సీపీ జెండా ఎగరేస్తాం

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాల సాధన, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేయటమే లక్ష్యంగా ఏలూరు నియోజకవర్గంలో పార్టీ నేతలు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తామని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. వైఎస్సార్ సీపీ ఏలూరు కార్యాలయంలో బుధవారం పార్టీ నగర అధ్యక్షులు గుడిదేశి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో జయప్రకాష్ మాట్లాడారు. రాబోయే కాలంలో పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్నీ విజయవంతం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలు, సూపర్ 6 పథకాల అమలులో ఘోరంగా వైఫల్యం చెందిందని, ప్రజలంతా తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారని వివరించారు. ప్రజలకు అండగా ఉంటూ వారి సమస్యలపై పోరాటం చేయటమే తమ పార్టీ లక్ష్యమన్నారు. గుడిదేశి శ్రీనివాసరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ హయాంలో ఎన్నికల మానిఫెస్టోను పవిత్రంగా భావిస్తూ అధికారం చేపట్టిన తొలి రోజు నుంచే సంక్షేమ పథకాల అమలుకు జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారని గుర్తు చేశారు. రెండేళ్ల కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా జయప్రకాష్, గుడిదేశిని పార్టీ నేతలు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి మున్నుల జాన్‌గురునాథ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకపెయ్యి సుధీర్‌బాబు, గ్జేవియర్ మాస్టారు, నగర ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇనపనూరి జగదీష్, జీఎంఆర్, దాసరి రమేష్, ఎండీ కైసర్, రియాజ్ భాషా, అశోక్, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, పార్టీ జిల్లా నేతలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త జయప్రకాష్



హాజరైన పార్టీ నగర అధ్యక్షులు, కీలక నేతలు

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	36	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	38	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	48	బీక్షదిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	48	చామదుంపలు	36
బెండకాయలు	38	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	64	కంద	--
కాకర కాయలు	40-48	బీట్‌రూట్	38
బీరకాయలు	36	కీరా దోస	50
బీరకాయలు (పందిరి)	54	ఫ్రెంచ్‌బీన్స్	100
క్యాబేజీ	28	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	20
దొండకాయలు	40	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	28	చుక్కకూర	12
గోరుచిక్కుడు	40	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనపకాయ (1)	10-15	క్యాప్సికమ్	90
పొట్లకాయ(1)	20	చిలకడదుంప	40

జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్‌గా శ్రీనివాసరావు



అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్: ఏలూరు జీఎస్టీ సర్కిల్-2 అసిస్టెంట్ కమిషనర్‌గా బి.శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఇటీవల సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన ఏలూరులోని సర్కిల్-2 కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏపీ సీటీవో సర్వీస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు కె.చిట్టిబాబు, జాయింట్ సెక్రటరీ కె.కిషోర్, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రటరీ జి.జాన్‌బాబు, తాలూకా జాయింట్ సెక్రటరీ ప్రసాద్‌బాబు మర్యాదపూర్వకంగా కలిసి ఆయనకు పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా వారి ఆదేశాలకు అనుగుణంగా పనిచేస్తూ ఉత్తమ సేవలు అందించాలని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసరావు సూచించారు.

విద్యార్థుల జీవితాలతో విద్యాశాఖ ఆటలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని ఉర్దూ పాఠశాలల విద్యార్థులతో జిల్లా విద్యాశాఖ ఆడ లాడుతోందని ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగ్గులోతు కృష్ణ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింల పిల్లలు ఎక్కువ మంది ఉర్దూ మీడియం చదివే మాకా ఉర్దూ పాఠశాలలో ఉర్దూ బోధించలేని ఉపాధ్యాయులను, తూర్పువీధి ఉర్దూ పాఠశాలలో 15 మంది కంటే తక్కువ మంది విద్యార్థులు ఉర్దూ మీడియం చదువుతుంటే ఈ పాఠశాలను రాత్రికి రాత్రే ఉర్దూ పాఠశాలగా యూడైస్‌లో మార్పు చేయడం ఏమిటని ప్రశ్నించారు. వీటిపై అధికారులు నిగ్గుతేల్చాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై దాదాపు నెల రోజులు గడుస్తున్నా ఈ రెండు పాఠశాలల విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో చదువుకునే అవకాశం లేకుండా పోయిందని, దీంతో వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.

పాండురంగ స్వామి ఆలయంలో పూజలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక పాతబస్టాండు వద్ద ఉన్న శ్రీ పాండురంగ స్వామి దేవస్థానంలో తొలి ఏకాదశి, గురు పౌర్ణమి మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం విఘ్నేశ్వర పూజ, శ్రీ లక్ష్మీ నారాయణ స్వామి, శ్రీ పాండురంగ స్వామి, శ్రీ సీతారామ స్వామి వార్లకు విశేష తులసీదళార్చన నిర్వహించారు. పురుష సూక్త సంపుటిత శ్రీ లక్ష్మీ నారాయణ హోమం, దుర్గా సప్తసతి బృందం ఆధ్వర్యంలో విష్ణు సహస్ర నామ పారాయణ, 11 సార్లు లక్ష్మీ అష్టోత్తర స్తోత్ర పారాయణ నిర్వహించారు. సాయంత్రం 7 గంటల నుంచి విశేష భజన కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేశారు. అర్చకులు దండిభొట్ల కనకసుందర శర్మ పూజలు చేయగా, కార్యనిర్వహణాధికారి సీహెచ్ చిన నాగేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.



లక్ష్మీ అష్టోత్తర స్తోత్ర పారాయణ నిర్వహించిన మహిళా భక్తబృందం సభ్యులు

వైభవంగా అమ్మవారి ఊరేగింపు

స్థానిక ఒన్‌టౌన్‌లోని శ్రీ అంబా భవాని అమ్మవారి ఆలయంలో భావసార్ ఓత్రి సమాజ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోందళ్ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం ప్రభాత భేరి నిర్వహించి 10 గంటలకు ఊరేగింపు ప్రారంభించారు. నగరంలోని పలు వీధుల్లో భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఒంటి గంటకు ఘట ప్రదానం చేసి అనంతరం ప్రసాద వినియోగం చేశారు. కార్యక్రమాలను భావసార్ క్షత్రియ సంఘం అధ్యక్షుడు కాలే శ్రీనివాసరావు, కార్యదర్శి గుజ్జరు మార్కండేయులు, కోశాధికారి టేకాళే గిరి, గుజ్జరు రమణ పర్యవేక్షించారు.

వెంకటరెడ్డిగూడెంకు రోడ్డు లేక ఇబ్బందులు

పోలవరం రూరల్: పోలవరం మండలం వింజరం పంచాయతీ వెంకటరెడ్డిగూడెం గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఏజెన్సీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా కార్యదర్శి కుంజం రామారావు మాట్లాడుతూ వెంకటరెడ్డిగూడెం గ్రామానికి సరైన రోడ్డు మార్గం లేక గిరిజనులు తీవ్ర అవస్థలు పడుతున్నారని చెప్పారు. గతంలో మంజూరైన రోడ్డును కూడా నిర్మించకపోవడంతో రోడ్డు గుంతల మయంగా మారి వర్షాకాలంలో వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారని తెలిపారు. తక్షణమే వింజరం నుంచి వెంకటరెడ్డి గూడెం, వెంకటరెడ్డిగూడెం నుంచి రామన్నపాలెం వరకు తారు రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్మెల్ పురం నుంచి వింజరం మీదుగా రేపల్లెవాడ వరకు దెబ్బతిన్న రోడ్డును కూడా వెంటనే నిర్మించాలని కోరారు. వెంకటరెడ్డిగూడెం పీసా కమిటీ ఉపాధ్యక్షుడు కొమరం రామారావు మాట్లాడుతూ తమ గ్రామం గుండా ప్రవహించే ఊట కాలవ పోలవరం ప్రాజెక్టు కాలవ వద్ద ఇసుక మేట వేయడంతో నీరు వెనక్కి తన్ని ఇళ్లల్లోకి నీరు వస్తుందని, పాములు, పురుగులు వస్తున్నాయని తెలిపారు. వెంటనే ఇసుక మేటను తొలగించాలని, ఊట కాలవపై బ్రిడ్జి నిర్మించాలని కోరారు. పీసా కమిటీ కార్యదర్శి చెదల శివకుమార్ రెడ్డి మాట్లాడుతూ అంగన్‌వాడీ భవనం సమస్యను పరిష్కారించాలన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రం ఎంపీడీఓ శ్రీనివాస్ బాబుకి అందజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమానికి ఏజెన్సీ గిరిజన సంఘ నాయకులు మడి వెంకటగిరి, కొమరం రామారావు, వలస బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ స్కూల్ బస్సుల తనిఖీ

కామవరపుకోట: స్థానిక చెక్‌పోస్టు సెంటర్లో ప్రైవేట్ పాఠశాల బస్సులను అధికారులు బుధవారం తనిఖీ చేశారు. ఓ బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్‌లో కిట్ లేకపోవడంతో కేసు నమోదు చేశామని జంగారెడ్డిగూడెం అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు కేడీవీ రవిగోపాల్, సీహెచ్ సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఇప్పటి వరకు జంగారెడ్డిగూడెం ఆర్టీఓ పరిధిలో ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, లైసెన్స్, డాక్యుమెంట్స్ ఫోర్స్‌లో లేని వారిపై 16 కేసులు నమోదు చేశామని తెలిపారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా స్కూల్ బస్సుకు ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, ఫైర్ సేఫ్టీ, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, అనుభవజ్ఞులైన డ్రైవర్‌తో పాటు క్లీనర్ తప్పకుండా ఉండేలా మెయింటెన్ చేయాలని యాజమాన్యాలకు సూచించారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	30
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	35
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - అమరావతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో 22సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	31
ఏలూరు -జీడిమెట్ల వయా ఖమ్మం	21.15	4802	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	34
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	32
ఏలూరు - తిరుపతి	16.00	4830	33